www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 23 నవంబర్ 2022

రజక సదస్సును జయప్రదం చేయండి : ఏపిఆర్‌విఎస్

ప్రజాశక్తి - తిరుపతి డిసెంబర్ 18 తేదీ తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రజక వత్తిదారుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఏపీ ఆర్ వి ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జూరేపల్లి దిలీప్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక వేమన విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సాయంత్రం ఏపీ ఆర్ వి ఎస్ జిల్లా సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దిలీప్ కుమార్ మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులో పలు కీలక నిర్ణయాలను తీసుకోనున్నట్లు ప్రకటించారు. ప్రధానంగా తిరుమల తిరుపతి దేవస్థానంలోని బట్టలు శుభ్రం చేసే పనిని రజకులకే కేటాయించాలని, టిటిడి ఆధ్వర్యంలో శ్రీనివాస మోడ్రన్ ధోబి ఘాట్ ను ఏర్పాటు చేయాలని, తిరుపతి జిల్లాలో రజకులకు అవసరమైన దోబిఘాట్లు, నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని తీర్మానించినట్లు తెలిపారు.గౌరవ సలహాదారులు గండికోట ఈశ్వరయ్య, అధ్యక్షులు ఎన్ మునిరత్నం ,నాయకులు కే.నాగరాజు , గండికోట నాగరాజుశివకుమార్ , వెంకటరమణ, రాధాకష్ణ, మహిళ నాయకులు జయంతి, వనజ, పౌర్ణమి పాల్గొన్నారు.

'వైకల్యమే' వారికి 'లాభం'

తిరుపతిలో బడా వ్యాపారుల దందా

రోజుకు రూ.250-300 కూలి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతిలో పెద్దపెద్ద వ్యాపారులు హోకర్లుగా మారారు. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి పండ్లు, కూరగాయలు, ఆకుకూరలను తిరుపతి శివారు ప్రాంతాల్లోని రోడ్లలో పెట్టి అమ్మిస్తున్నారు. అయితే ఇందులో ఓ మానవీయ కోణం దాగి ఉంది. పేద, మధ్యతరగతి వారు పండ్లు, కూరగాయలు అమ్ముకుని జీవిస్తున్నారని అనిపిస్తుంది. వాస్తవానికి వికలాంగులు, పేద మహిళలు, ఒంటరి మహిళలను ఆసరా చేసుకుని రోజుకు లక్షల రూపాయలు వ్యాపారం చేస్తున్న వైనం వాస్తవం. తిరుపతిలోని కపిలతీర్థం, పద్మావతి యూనివర్సిటీ, కెటి రోడ్డు, రాయలచెరువు రోడ్డు, ఎంఆర్‌పల్లి, అవిలాల రోడ్డు, రేణిగుంట రోడ్డు, బాలాజీ కాలనీ, ఎస్‌వి యూనివర్సిటీ రోడ్డులో రోడ్డుకు ఇరువైపులా పండ్లు, కూరగాయలు తాజాగా దొరుకుతుంటాయి. ఇందులో పనిచేసేందుకు గ్రామాలలో పనిలేకుండా ఊరికే ఉండేవారిని వ్యాపారస్తులు 'గేలం' వేస్తున్నారు. ప్రధానంగా వీరు వికలాంగులను ఎంచుకుంటున్నారు. వీరైతే చీటికిమాటికి అటు ఇటు పోకుండా స్థిరంగా కూర్చుని ఉంటారు. పేద మహిళలు, ఒంటరి మహిళలకు అవకాశం ఇస్తారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు వీరు వ్యాపారాలు చేయాలి. రోజుకు 250-300 వరకు వీరికి కూలి ఉంటుంది. యజమాని చెప్పిన మేరకే వీరు వ్యాపారం చేయాల్సి ఉంటుంది. రోజంతా కష్టపడిన మొత్తం యజమానికి ఇచ్చేయాలి. వీరికి నెలలో ఒక్కరోజు కూడా సెలవు ఉండదు. వ్యాపారం చేస్తేనే కూలి. ఆ విధంగా బడా వ్యాపారులు వికలాంగులు, పేద మహిళలను అడ్డు పెట్టుకుని వారి శ్రమను దోచుకుంటూ లక్షల రూపాయలు గడిస్తున్న వైనం తిరుపతి పుణ్యక్షేత్రంలో జరుగుతున్న తంతు ఇది.

రోజుకు రూ.300 ఇస్తారు

ప్రసాద్, వికలాంగుడు, మల్లంగుంట

వీధివ్యాపారం చేసేందుకు ఆసక్తి చూపేవారికి గ్రామాల్లోకి వచ్చి బడా వ్యాపారులు మమ్మల్ని ఎంచుకుంటారు. మాది మల్లంగుంట దళితవాడ. కొడుకు వికలాంగుడు అవడంతో మా అమ్మ మానసిక క్షోభకు గురై చనిపోయింది. మా నాన్న రెండో పెళ్లి చేసుకున్నాడు. ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. ఊరికే తింటూ కూర్చుంటే ఎలా అని మా నాన్న నిత్యం బాధపెట్టేవాడు. వ్యాపారులు వచ్చి మా ఊళ్లో ఉన్న ముగ్గురు వికలాంగులను ఎంపిక చేసుకున్నారు. రోజుకు 300 రూపాయలు ఇస్తామని చెప్పారు. గత ఆరేళ్లుగా ఇదేవిధంగా పండ్ల వ్యాపారం చేసుకుంటూ రోజుకు 300 రూపాయలు సంపాదించుకుంటున్నాను. డబ్బు ఇస్తున్నా కాబట్టి ఇంట్లో బాగానే చూసుకుంటున్నారు. అయితే మాకు ఇచ్చే దినసరి కూలి కేవలం 300 మాత్రమే. వేలల్లో వ్యాపారం చేస్తున్న మాకు కూలి గిట్టుబాటు కావడం లేదు.

దీర్ఘకాలిక డిమాండ్లపై...

దద్దరిల్లిన కలెక్టరేట్

ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలి : యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులకు పిఎఫ్, ఏపీ జిఎల్ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్ లకు సంబంధించి రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో చిత్తూరు కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా జరిగింది. యుటిఎఫ్ రాష్ట్ర పిలుపు మేరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల నాయకత్వం ఆధ్వర్యంలో కలెక్టరేట్ దద్దరిల్లింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ గత ఎనిమిది నెలలుగా ఉద్యోగ ఉపాధ్యాయులు దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్ఐలకు సంబంధించిన రుణాలు గానీ, ఫైనల్ పేమెంట్లు గానీ, డిఎ బకాయిలు గానీ ఇంతవరకు జమ కాలేదన్నారు. ప్రభుత్వానికి అనేక దఫాలు విన్నవించినప్పటికీ చలనం లేకపోవడం వల్లనే ధర్నా చేశామన్నారు. రాష్ట్రంలో పిఆర్‌సిని జనవరి నుంచి అమలు చేసినా ఇంతవరకూ సంబంధిత బకాయిలు చెల్లించలేదన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా అన్ని బకాయిలను నెలలోపు తీరుస్తామని గత ఏప్రిల్‌లో తెలియజేసిందని, ఇప్పటివరకూ ఎలాంటి బకాయిలు చెల్లించలేదన్నారు. రాష్ట్ర కార్యదర్శి రఘుపతిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలన్నారు. మధ్యేమార్గంగా జిపిఎస్‌ను తీసుకురావడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. సిపిఎస్ రద్దు కోసం భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు చేస్తామన్నారు. జి.రాధాక్రిష్ణ మాట్లాడుతూ బకాయి మొత్తాలను చెల్లించని పక్షంలో ఈనెల 30న విజయవాడలో ధర్నా చేస్తామని హెచ్చరించారు. చిత్తూరు జిల్లాలో పి.ఎఫ్: 48.02 కోట్లు, ఏపీ జి.ఎల్.ఐ:26.78 కోట్లు, డి.ఏ./ఇ ఎల్:44.78 కోట్లు, హాఫ్ పే లీవ్:13.25 కోట్లు మొత్తానికి 132.83 కోట్లు అరియర్ చెల్లించాలని కోరారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా యుటిఎఫ్ నాయకులు జీవి రమణ, ముత్యాల రెడ్డి, సుధాకర్ రెడ్డి, సోమశేఖర్ నాయుడు, సుధాకర నాయుడు, రెహానా బేగం, సూర్య ప్రకాష్, పి.ఆర్ మునిరత్నం, ప్రసన్న కుమార్, రెడ్డప్ప నాయుడు పాల్గొన్నారు.

స్విమ్స్ కాంట్రాక్టు ఉద్యోగుల ఆందోళన

ఉంటుందో... ఊడుతుందో...!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్)లో దినదిన గండంగానే ఉంటుంది.. కనీస వేతనం మాట దేవుడెరుగు? ఉద్యోగ భద్రత లేకుండానే విధులు నిర్వహించే పరిస్థితి. ఇరవై ఏళ్లుగా 800 మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారు. మొదట్లో 1200 రూపాయల జీతంతో చేరిన వారు ప్రస్తుతం ఇఎస్ఐ, పిఎఫ్ పోగా 10,800 రూపాయలు చేతికొస్తోంది. ఎప్పటికైనా పర్మినెంట్ చేస్తారనే ఆశతో ఇన్ని రోజులూ వారు రోగులకు సేవలు చేస్తూ తృప్తిగానే విధులు నిర్వహిస్తున్నారు. వీరి పని ప్రధానంగా పారిశుధ్యం, పడకలు శుభ్రం చేయడం, బాత్రూమ్‌లు శుభ్రంగా ఉంచడం, చెత్త ఉంచడం. స్విమ్స్ ప్రాంగణం పరిశుభ్రంగా ఉంటుందంటే వీరిదే ప్రధాన పాత్ర. అలాంటి వారిని టిటిడి తాజాగా తీసుకొచ్చిన లక్ష్మీ శ్రీనివాస కార్పొరేషన్‌లో విలీనం చేసేందుకు యాజమాన్యం సిద్ధమయ్యింది. అయితే 60 ఏళ్లు పైబడిన వారిని, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు 70 మంది ఉన్నారని తేల్చింది. వీరిని తొలగించి, మిగిలిన అందరినీ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని నిర్ణయించింది. విషయం తెలుసుకున్న కార్మికులు ఇన్ని రోజులు తమతో కలిసి పనిచేసిన వారిని తొలగించడం అన్యాయమని, 800 మందిని విలీనం చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సోమవారం రాత్రి సిఐటియు ఆధ్వర్యంలో స్విమ్స్ డైరెక్టర్ వెంగమ్మను కలిసి విన్నవించారు. వీరి అభ్యర్థనను కూలంకుషంగా ఉన్న వెంగమ్మ తాను చిన్నతనంలో ఏ విధంగా కష్టపడి పైకొచ్చానో చెబుతూ, కష్టం విలువ తనకు తెలుసని చెప్పింది. ఎవరినీ తీయబోమని భరోసా ఇచ్చింది. అయితే ప్రతి ఒక్కరూ స్విమ్స్ నిబంధనల మేరకు కష్టపడి పనిచేయాలని పేర్కొంది. దీంతో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

అందరినీ కొనసాగిస్తాం : వెంగమ్మ, స్విమ్స్ డైరెక్టర్

స్విమ్స్ ఆస్పత్రిలోని కార్మికులను ఎవరినీ తొలగించడం లేదు. మంగళవారం ఉదయం తన ఛాంబర్ వద్ద కలిసిన కార్మికులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. స్విమ్స్ ఆస్పత్రి టిటిడి యాజమాన్య పరిధిలోకి వెళ్లిన తరువాత కార్మికులను శ్రీ లక్ష్మి శ్రీనివాస కార్పొరేషన్ పరిధిలో విలీనం చేస్తున్నాం. ఈ సందర్భంగా కొన్ని సమస్యలు ఉత్పన్నమయ్యాయి. అటెండెన్స్ లేనివారు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు, 60 ఏళ్లు పైబడిన వారికి సంబంధించి జాగ్రత్తలు తీసుకోవాల్సి వచ్చింది. అయితే సిఐటియు నాయకులు కందారపు మురళి, ఆర్.లక్ష్మి, యూనియన్ నాయకుల విజ్ఞప్తిని దృష్టిలో ఉంచుకుని కార్మికులందరికీ ఉపాధి కల్పిస్తున్నాం.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై పోరాడేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలే

ప్రెస్‌మీట్‌లో అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై గళం విప్పేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని పిడిఎఫ్ బలపర్చిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర రెడ్డి పేర్కొన్నారు. స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో మీగడ వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదు ప్రక్రియలో రాజకీయ పార్టీలు అడ్డగోలుగా వ్యవహరించాయని విమర్శించారు. తూర్పు రాయలసీమ నియోజకవర్గ పరిధిలో ఈనెల 5వ తేదీ నాటికి 2.66 లక్షల దరఖాస్తులు వస్తే 7వ తేదీ నాటికి 4.18 లక్షల దరఖాస్తులు దాఖలయ్యాయన్నారు. సుమారు 1.50 లక్షల దరఖాస్తులు ఒక్క రోజులోనే వచ్చాయని, అధికార పార్టీ వాలంటీర్ల ద్వారా, ప్రతిపక్ష పార్టీ పెద్ద సంఖ్యలో దరఖాస్తులు ఇచ్చిందన్నారు. ఈ విషయమై ఎన్నికల సంఘానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఫిర్యాదు చేశారన్నారు. రాష్ట్రంలో 60 వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, 2.45 లక్షల మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వీరికి ఉద్యోగ భద్రత లేదన్నారు. పంజాబ్, రాజస్థాన్, ఛత్తీస్‌ఘడ్‌లలో సిపిఎస్‌ను రద్దు చేశారని, హిమాచల్ ప్రదేశ్‌లో కాంగ్రెస్ గెలిస్తే సిపిఎస్ రద్దు చేస్తామని ప్రియాంక గాంధీ, గుజరాత్‌లో ఆప్ గెలిస్తే సిపిఎస్ రద్దు చేస్తామని సిఎం కేజ్రీవాల్ ప్రకటించారన్నారు. పాదయాత్ర సమయంలో సిపిఎస్‌ను రద్దు చేస్తామని సిఎం ప్రకటించి మూడేళ్ళు అవుతున్నా జాప్యంపై సిఎం జగన్మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వంపై ఉద్యోగ, ఉపాధ్యాయులు అసంతృప్తితో ఉన్నారని, వారు దాచుకున్న పిఎఫ్, ఎపిజిఎల్ఏ డబ్బులను ఇవ్వట్లేదన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరిస్తాం, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు ఎప్పుడూ ఉండేవని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన 6 డిఏలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి, డిఏ అరియర్స్, విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన డిఏ అరియర్స్ చెల్లించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, ఉద్యోగులు ప్రజలలో భాగమనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలన్నారు. తాను ఎమ్మెల్సీగా గెలిస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ, రైతులు, నిరుద్యోగులు, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. శాసనమండలిలో ప్రజా గొంతుక వినిపిస్తామన్నారు. ప్రభుత్వం మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఎస్సై, గ్రూపు-3, 4 పోస్టులను విడుదల చేయాలన్నారు. అదేవిధంగా ఎపి రెసిడెన్షియల్, గిరిజన పాఠశాలలు, కెజిబివిలలో పనిచేస్తున్న సిఆర్‌టి, పిజిటిల సమస్యలపై చర్చిస్తామని, వారు చేస్తున్న పనికి, ఇస్తున్న వేతనానికి సంబంధం లేదన్నారు. పిఆర్‌సి అమలు చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఓవి వీరారెడ్డి, ఎస్.రవి, సహాధ్యక్షురాలు జి.ఉమా మహేశ్వరి, కోశాధికారి కె.లక్ష్మినారాయణ, బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.శ్రీనివాసరావు, సిపిఎస్ ఉద్యోగుల జిల్లా కన్వీనర్ షేక్ అబ్దుల్ హై పాల్గొన్నారు.

పులికాట్ తీరప్రాంత అభివృద్ధిపై ఎంపి చొరవ

తిరుపతి సిటి : పులికాట్ సరస్సు తీర ప్రాంతాలైన సూళ్లూరుపేట మండలం పేర్నాడు, వేనాడు గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. హైసెన్సిటివ్, బర్డ్ శానిటరీ జోన్ కావడంతో ఆ గ్రామాలకు రోడ్లు, శాశ్వత నిర్మాణాలు ఏర్పాటు చేయడానికి అనుమతులు లభించడం లేదు. తిరుపతి ఎంపి గురుమూర్తి ఈ సమస్యలపై ఇప్పటికే కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖా మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి విన్నవించారు. పులికాట్ లేఖ్ డెవలప్‌మెంట్ అథారిటీ వేయాలని సిఎం జగన్‌ను కోరారు. సమగ్రమైన ప్లాన్ రెడీ చేసి నిర్మాణాలకు తగు చర్యలు తీసుకుంటామని ఎంపి గురుమూర్తి తెలిపారు.

రేపు వృద్ధులు, దివ్యాంగుల దర్శన కోటా విడుదల

ప్రజాశక్తి -తిరుమల వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా డిసెంబరు నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను నవంబరు 24వ తేదీన ఉదయం 10 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ విషయాన్ని గమనించి ఆన్‌లైన్‌లో ఉచిత దర్శన టోకెన్లు బుక్ చేసుకోవాలని కోరుతోంది.

దోమల నివారణకు ఫాగింగ్ మిషన్లు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో మరో రెండు కొత్త ఫాగింగ్ మిషన్లను తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణలు మంగళవారం నగరపాలక సంస్థ ప్రాంగణంలో పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ అనుపమ అంజలి మాట్లాడుతూ తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిదిలో ఇప్పటికే దోమల నివారణకు ఒక ఫాగింగ్ మిషన్ వుందని, ఇప్పుడు మరో రెండు ఫాగింగ్ మిషన్లను 24 లక్షలు వెచ్చించి కొనుగోలు చేశామన్నారు. దోమల నివారణకు ప్రతి ఒక్క డివిజన్లో ఈ ఫాగింగ్ మిషన్లు నిరంతరం పని చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికష్ణ, ఎంఈలు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, డిఈ విజయకుమార్ రెడ్డి, శానిటరి సూపర్ వైజర్లు చెంచెయ్య, సుమతి, మేనేజర్ చిట్టిబాబు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్త చర్యలతో ఎయిడ్స్, టీబీ నివారణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ముందుగానే జాగ్రత్త చర్యలు తీసుకుంటే ఎయిడ్స్, టి.బి వ్యాధులను నివారించవచ్చని గ్రాసం ప్రాజెక్ట్ మేనేజర్ స్వామి చెప్పారు. మంగళవారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ యూనిట్(ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ) వారి సహకారంతో గ్రాసం సంస్థ ఆధ్వర్యంలో తిరుపతి మున్సిపల్ ఆఫీస్ సర్కుల దగ్గర ఉన్న వలస కార్మికులకు, నిరాశ్రయులకు 'హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణ – స్వీయ నివారణ చర్యలు' పై కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించినట్లు గ్రాసం సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ ఎన్. దొరస్వామి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ మూలస్తానమ్మ యల్లమ్మ బిల్డింగ్ వర్కర్స్ అసోసియేషన్ యూనియన్ లీడర్ డి. సుబ్రహ్మణ్యం విచ్చేశారు. మరింత సమాచారం కొరకు టోల్ ఫ్రీ నంబర్ 1097 ను సంప్రదించాలని తెలియజేశారు. ఈ కళాజాత కార్యక్రమంలో సభ్యులు రెడ్డప్ప, గుర్రప్ప పాల్గొన్నారు.

'ప్రసూతి ఆస్పత్రి బయటే ప్రసవం'పై విచారణ

తిరుపతి టౌన్ : ప్రసూతి ఆస్పత్రి బయటే ప్రసవం' అనే వార్తా కథనాలపై కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి స్పందించి సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం ఉత్తర భారతీయ బిలాస్‌పూర్‌కు చెందిన కంఠీర (21) కడుపునొప్పితో బాధపడుతూ మెడికల్ కాలేజీ బాయ్స్ హాస్టల్ పక్కన టీస్టాల్ ముందు పడిపోయిందని, టీ స్టాల్‌లో ఉన్న వారు, ఆస్పత్రి చుట్టుపక్కల ఉన్న పేషెంట్ల సహాయకులు పురుడు చేశారని తేలింది. తదుపరి సాయం కోసం ఆస్పత్రి సిబ్బందికి వారు తెలియజేయడంతో సిబ్బంది హుటాహుటిన చేరుకుని పేషంట్‌ను, పాపను లేబర్ రూమ్‌లోకి తీసుకెళ్లి తదుపరి వైద్య సాయం అందజేశారని తెలిపారు. గర్భిణి మానసిక పరిస్థితి నిలకడగా లేదని తేలిందని నివేదికలో పేర్కొనడం గమనార్హం.

ప్రతి దళితవాడకూ శ్మశాన స్థలం కేటాయించాలి

కెవిపిఎస్ అధ్యక్ష కార్యదర్శులుగా మునిరామయ్య, అరుణాచలం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ప్రతి దళిత వాడకు రెండెకరాల శ్మశాన స్థలం కేటాయించాలనీ, దళితవాడల అభివద్ధికి జారీ చేసిన జీవో.1235ను వెంటనే అమలు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. పట్టణంలోని స్థానిక సిఐటియు కార్యాలయంలో కెవిపిఎస్ జిల్లా మహాసభల్లో భాగంగా రెండవ రోజు ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దళితులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు.

అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కెవిపిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా అంగేరి పుల్లయ్య, జిల్లా అధ్యక్షుడిగా పి. మునిరామయ్య, ఉపాధ్యక్షులుగా కే. పెంచలయ్య, టీ.ముత్యాలయ్య, టి.శేఖర్, సెల్వరాజ్, ప్రధాన కార్యదర్శిగా దేశాండి అరుణాచలం, కార్యదర్శులుగా రెడ్డిపల్లి సురేష్, మునెయ్య, వెంకటేశ్వరావు, అన్నపూర్ణమ్మ, మధు, కోశాధికారిగా బాలాజీ, సభ్యులుగా హరి, రఘు, చైతన్య, విశ్వనాథం, గురవయ్య, రమేష్, ఏ ప్రసాద్, అంకయ్య, నరేంద్ర, మురళి, సిసింద్రీ, పోలయ్య, సుబ్రహ్మణ్యం. ఎస్కే గౌస్ బాషా, కష్ణయ్య, సురేష్, అరుల్, పి బాలాజీ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి దేశాండి. అరుణాచలం మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను వారికే కేటాయించాలన్నారు. ఎస్సీ ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండు చేశారు. సాంస్కతిక రంగంలో పనిచేస్తున్న డప్పు, భజన కళాకారులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి 45 ఏళ్ళకే పెన్షన్ అందజేయాలని కోరారు. కుల వివక్షను అంతం చేసేందుకు జస్టిస్ పునయ్య కమిషన్ ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

తొట్టంబేడు ఐసీడీఎస్ ప్రాజెక్టు రద్దు!

40 కిలోమీటర్ల దూరంలోని పిచ్చాటూరులో విలీనం

శ్రీకాళహస్తిలో కలపాలంటున్న అంగన్‌వాడి సిబ్బంది

ఉమ్మడి జిల్లాలో మరో మూడు ప్రాజెక్టుల మూత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

పరిపాలన సౌలభ్యంలో భాగంగా ఇటీవలే జిల్లాలు, ఆర్డిఓ కేంద్రాల పునర్వ్యవస్థీకరణకు దిగిన వైసిపి ప్రభుత్వం తాజాగా ఆ జాబితాలోకి ఐసిడిఎస్ ప్రాజెక్టులను చేర్చింది. ఇందులో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు గత వారమే గెజిట్ ఇచ్చింది. రద్దు కాబడిన ఐసిడిఎస్ ప్రాజెక్టుల్లో తొట్టంబేడు, చిన్నగొట్టిగల్లు, కార్వేటినగం, బంగారుపాళెంలు ఉన్నాయి. జిల్లాల పునర్ వ్యవస్థీకరణ అనంతరం కొన్ని సీడీపీవోలు ఇతర జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల పరిధిలోకి వెళ్లాయి. ఈ నేపథ్యంలో పాలనాపరమైన ఇబ్బందులను అధిగమించడం కోసం వాటి పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలతోపాటు పర్యవేక్షి స్తున్న సీడీపీవో కేంద్రాలకు కొత్త పరిధులను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఫలితంగా సీడీపీవో కేంద్రాలన్నీ ఒకే జిల్లాకు, అందులోని మండలాలన్నీ ఒకే రెవెన్యూ డివిజనుకు చేరే సౌలభ్యం కలుగుతుంది. ఈ క్రమంలోనే ఉమ్మడి చిత్తూరు జిల్లాలో కొనసాగిన చిన్నగొట్టిగల్లు, తొట్టంబేడు, కార్వేటినగరం, బంగారుపాళెం సీడీపీవో కేంద్రాలను రద్దు చేశారు. చిన్నగొట్టిగల్లు సీడీపీవో కేంద్ర పరిధిలోని చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాలను తిరుపతి జిల్లాకు, కేవీపల్లె, పీలేరు మండలాలను అన్నమయ్య జిల్లాకు బదలాయించగా మిగిలిన కేంద్రాల్లోని మండలాలను తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో వేర్వేరు సీడీపీవో కేంద్రాలకు సర్దుబాటు చేశారు. కాగా శ్రీకాళహస్తిలో ఒక భాగంగా ఉన్న తొట్టంబేడు ఐసీడీఎస్ కార్యాలయాన్ని 40 కిలోమీటర్లకు పైగా దూరంగా ఉన్న పిచ్చాటూరుకు మార్పు చేయడం అంగన్ వాడీ సిబ్బంది జీర్ణించుకోలేక పోతున్నారు. తొట్టంబేడును శ్రీకాళహస్తిలో కలపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాపరంగా, రెవెన్యూ డివిజన్ పరంగా చూసినా తొట్టంబేడు ఐసిడిఎస్ ప్రాజెక్టును శ్రీకాళహస్తిలోనే కలపాలన్నది వాదన. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏ మేరకు నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి మరి.

ప్రస్తుతం చిత్తూరు జిల్లాలో 11 సీడీపీవో కేంద్రాల పరిధిలో మొత్తం 2,420 అంగన్వాడీ కేంద్రాలను (ఇందులో 625 మినీలను కలుపుకుని) పునర్వవస్థీకరించారు. తాజా పునర్వ్యవస్థీకరణ అనంతరం వెంకటగిరి సీడీపీవో కేంద్రం పరిధిలోకి డక్కిలి, వెంకటగిరి, బాలాయపల్లి మండలాలను (261 అంగన్వాడీ కేంద్రాలు), కోట కేంద్రం పరిధిలోకి వాకాడు, కోట, చిట్టమూరు (227 కేంద్రాలు), గూడూరు పరిధిలోకి గూడూరు, చిల్లకూరు (279), నాయుడుపేట పరిధిలోకి ఓజిలి, నాయుడుపేట, పెళ్లకూరు (216), సూళ్లూరుపేట పరిధిలోకి దొరవారిసత్రం, సూళ్లూరుపేట, బుచ్చినాయుడుకండ్రిగ (204), సత్యవేడు పరిధిలోకి వరదయ్యపాలెం, సత్యవేడు, తడ (181), పిచ్చాటూరు పరిధిలోకి తొట్టంబేడు, నాగలాపురం, పిచ్చాటూరు, కేవీబీపురం, నారాయణవనం (279), శ్రీకాళహస్తి పరిధిలోకి రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి (263), పుత్తూరు పరిధిలోకి రామచంద్రాపురం, వడమాలపేట, పుత్తూరు (186), తిరుపతి రాస్ పరిధిలోకి తిరుపతి మున్సిపాలిటీ, రేణిగుంట ఎస్ఏడబ్ల్యూసీఎస్, తిరుపతి గ్రామీణ పరిధిలోని 10 కేంద్రాలు (121), చంద్రగిరి పరిధిలోకి ఎర్రావారిపాళెం, చిన్న గొట్టిగల్లు, పాకాల, చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాలను (277 కేంద్రాలు) చేర్చారు. కాగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి పిచ్చాటూరు సీడీపీవో పరిధిలోని విజయపురం, నింద్ర మండలాలు చిత్తూరు జిల్లాకే పరిమితం కాగా పిచ్చాటూరు మండలం మాత్రం తిరుపతి జిల్లాకు చేరింది. అలాగే పులిచెర్ల సీడీపీవో పరిధిలోని పాకాలను తిరుపతి జిల్లాలో చేర్చగా, పులిచెర్ల మాత్రం చిత్తూరుకు పరిమితమైంది. ఇక పుంగనూరు సీడీ పీవో పరిధిలోని రామసముద్రం అన్నమయ్య జిల్లాకు బదిలీ కాగా, పెద్దపం జాణి, పుంగనూరు మండలాలు యథాతథంగా చిత్తూరు పరిధిలోకి చేరాయి.

'సైబర్' మోసాల నుంచి కాపాడుకోవాలి

ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎం.అరుణ

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

బ్యాంకు ఖాతాదారులు సైబర్ మోసాల నుంచి అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ ఎం.అరుణ తెలిపారు. మంగళవారం ఇండియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో తిరుపతి డిఆర్ డిఎ నందు ఆర్ బి ఐ వారి జాతీయ సమగ్ర అవగాహన కార్యక్రమం టౌన్ హాల్ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమం చిత్తూరు , తిరుపతి జిల్లాలకు కలిపి తిరుపతిలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం ఆర్.బి.ఐ వారి అమ్బుడ్స్ మ్యాన్ స్కీమ్, కేంద్ర ప్రభుత్వం వారి ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, జీవన జ్యోతి భీమా యోజన, సైబర్ నేరాలు ఉద్దేశించి చిత్తూరు జిల్లా లీడ్ డిస్ట్రిక్ మేనేజరు యమ్ .శేషగిరి రావు వివరించారు. పట్టణ దిశ అధికారి రామరాజు మాట్లాడుతూ మహిళా ఖాతాదారులు దిశ యాప్‌ను ఉపయోగిస్తూ భద్రంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైం సిఐ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని చితకబాదిన గ్రామస్తులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

'గుడ్ టచ్... బ్యాడ్ టచ్' నేర్పాల్సిన ఉపాధ్యాయుడే వక్రమార్గంలో విద్యార్థిని పట్ల వక్రబుద్ధి చూపాడు. పుత్తూరు రూరల్ వేపగుంట ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు గోపీనాథ్‌ను మంగళవారం గ్రామస్తులు చితకబాదారు. ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తించడంతో విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆగ్రహంతో చితకబాది పోలీసులకు అప్పగించారు.

విఐపి బ్రేక్ దర్శనాల సమయం మార్పు..

సామాన్యులకు శుభవార్త..!

డిసెంబర్ 1 నుంచి పూర్తిస్థాయిలో అమలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో
తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) భక్తుల కోసం ఎన్నో నిర్ణయాలు తీసుకుంటోంది. డిసెంబర్ 1 నుంచి వీఐపీ దర్శనాల సమయాలను మార్పులని నిర్ణయించింది. ఈ మేరకు పలు తీర్మానాలు ఆమోదించింది. నెల రోజుల పాటు ఉదయం 8 గంటలకే బ్రేక్ దర్శనాలు ప్రారంభించాలని చూస్తోంది. ఇది పరిశీలనాత్మకంగానే చేపడతోంది. ఈ నిర్ణయం సక్సెస్ అయితే కొనసాగించాలని భావిస్తోంది. తిరుపతికి వెళ్లాలనుకునే వారికి ఇది నిజంగా శుభవార్త. భక్తుల కష్టాలు తీర్చేందుకే టిటిడి ఇలా నిర్ణయం తీసుకుంది. స్వామి వారి దర్శనం భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకే టీటీడీ ఆలోచిస్తోంది. ఇందులో భాగంగానే వీఐపీ బ్రేక్ దర్శనాల వల్ల సామాన్య భక్తులకు తిప్పలు తప్పడం లేదు. వీఐపీలు వచ్చి వెళ్లిపోయే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి. దీంతోనే టీటీడీ కొన్ని మార్పులకు శ్రీకారం చుడుతోంది. ప్రయోగాత్మకంగా భక్తులకు ఇబ్బందులు కలగ కుండా చూడాలని తాపత్రయ పడుతోంది. సామాన్య భక్తుల కష్టాలు పరిగణన లోకి తీసుకుని పాలకమండలి కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం వీఐపీ బ్రేక్ దర్శనాలు సోమవారం ఉదయం 5 గంటల నుంచి 5.45 వరకు నిర్వహిస్తున్నారు. మంగళ, బుధ, గురు వారాల్లో 6.30 నుంచి 7 గంటల వరకు, శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 8.30 వరకు, శని, ఆది వారాల్లో ఉదయం 5 నుంచి 5.30 గంటల వరకు చేస్తున్నారు. దీంతో టీటీడీ ఇక మీదట అన్ని రోజుల్లో ఉదయం 8 గంటలకే నిర్వహించి సామాన్య భక్తులకు ముందుగానే స్వామి వారి దర్శన భాగ్యం కలిగించాలని చర్యలు చేపడుతోంది. టీటీడీ తీసుకున్న నిర్ణయం భక్తులకు మంచి కలిగించనుంది. భక్తులు దేవుడిని నిజంగా శుభ పరిణామమే. దేశంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తిరుమలకు తరలి వస్తుంటారు. వారి దర్శనానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చేయడానికే టీటీడీ ఈ మేరకు నిర్ణయించింది. దీని కోసం వీఐపీ దర్శన సమయంలో మార్పులు చేసి సామాన్య భక్తులకు ఊరట కలిగించనుంది. సరైన సమయంలో దేవుడిని దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించు కోవడానికి అవకాశాలు కల్పిస్తోంది.

తిరుపతి జనావాసాల్లోకి 'చిరుతలు'

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో
ఒకప్పుడు తిరుపతి శివారు ప్రాంతాల్లో భయభ్రాంతులకు గురిచేసిన చిరుత పులులు ప్రస్తుతం తిరుపతికి కూతవేటు దూరంలోనే సంచరిస్తూ హడలెత్తిస్తున్నాయి. తిరుపతి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఎందుకంటే అది అటవీ ప్రాంతం.. అందులో కూడా చిరుతలు చాలా ఎక్కువగా తిరిగే ఆవాసాల కేంద్రం. దాదాపు 40 నుంచి 50 పైగా చిరుతలు శేషాచలాన్ని ఆవాసంగా చేసుకొని అక్కడ జీవనం సాగిస్తున్నాయి. సరైన తిండి అందకపోవడం..జనావాసాల్లో ఉన్న వీధి కుక్కల కోసం మాటు వేసి రాత్రి సమయాల్లో ఆ ప్రాంతంలో తిరుగుతూ .. అక్కడి స్థానికులను తీవ్ర భయాందోళనకు గురి చేస్తున్నాయి. ఒకప్పటి అటవీ ప్రాంతం అయినా ఇప్పుడు అదే పేదల పాలిట ఓ అవాస ప్రాంతం. జీవ లింగేశ్వర స్వామి ఆలయానికి సమీపంలోని జీవకోనలో భాగంగా ఉన్న బీడీ కాలనీ ఇంకా బ్యాంక్ కాలనీలో చిరుతలు తెగ హడలు పుట్టిస్తున్నాయి. సాయంత్రం ఆరు దాటిందంటే చాలు బయటకు వచ్చే సాహసం చేయడం లేదు ఇక్కడి ప్రజలు. కేవలం అత్యవసరాల్లో తప్ప అసలు బయటకు వెళ్లాల్సి ఒక్కటంతా కూడా వణుకుతూ చిరుత ఎక్కడ దాడి చేస్తుందో అంటూ బిక్కు బిక్కుమంటూ భయపడుతూ వెళ్లాల్సిన పరిస్థితి. ఇక ఈ చిరుత పులుల సంచారం తిరుపతి వాసులకు అసలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.. తిరుపతి నగరంలోని వెటర్నరీ యూనివర్సిటీ ఇంకా జీవకోన ప్రాంతాల్లో తరచూ చిరుత పులి సంచారం11111111 స్థానికులకు, అలాగే చదువుకునే విద్యార్థులకు వణుకు పుట్టిస్తోంది. ఈ రెండు ప్రాంతాలు అటవీ శేషాచలం ప్రాంతానికి అతి దగ్గర్లో ఉండడంతో ఆహార సేకరణ కోసం చిరుత పులులు అక్కడి జన నివాసాలకు వస్తు న్నాయి. ఇక జీవ కోనలోని ఎల్.ఎస్.నగర్, బ్యాంక్ కాలనీ, మొండికోన ఇంకా బీడీ కాలనీలో ప్రజలు చీకటి పడితే ఇండ్ల నుండి బయటకు వచ్చేందుకు తెగ భయపడుతున్నారు. ఇంకా రాత్రి సమయంలో అయితే కుక్కలను వేటాడేందుకు అటవీ ప్రాంతం నుండి నివాసాలకు వస్తున్న చిరుత పులిని చూసిన కుక్కల అరుపులకు నిద్ర లేకుండా కాలం గడుపుతున్నారు. అయితే మనుషులపై చిరుత పులి దాడి చేయకున్నా. చిన్న పిల్లలపై దాడి చేసే అవకాశం చాలా ఉండడంతో స్థానికులు ఆందోళనకు గురి అవుతున్నారు.ఆ చిరుత పులి సంచారాన్ని అక్కడి సీసీ కెమెరాల ద్వారా గుర్తించారు.

ద్విచక్రవాహనం ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ద్విచక్రవాహనం ఢీకొని మహిళామృతి చెందిన సంఘటన మండలంలో మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... పుత్తూరు మండలం గూళూరు గ్రామానికి చెందిన వసంతమ్మ(56) ఈమె తిరుపతిలోని ఓ హోటల్లో పనిచేస్తుంది. మంగళవారం పని ముగించుకొని తన గ్రామానికి వెళ్లేందుకు శిరిగిరాజుపాలెం బస్‌స్టాప్ వద్ద బస్సుదిగి రోడ్డు దాటుతున్న సమయంలో పుత్తూరు వైపు నుండి తిరుపతికి వెళుతున్న ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి ఢీకొనడంతో ఆమె మృతి చెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బోరు లారీ బోల్తా - క్లీనర్ ...

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం తడుకు నుంచి ఎస్‌బీఆర్‌పురం వెళ్లే మార్గంలో మంగళవారం మధ్యాహ్నం బోరు లారీ అదుపు తప్పి బోల్తా పడింది. వడమాలపేట పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చత్తీస్‌ఘడ్‌కు చెందిన హరిత్ (19) లారీ ఎడమవైపు తల బయటపెట్టి ఉన్నందున, లారీ అదుపు తప్పి బోల్తాపడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటి ట్యాంక్‌పై నుండి దూకి..

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రక్షించిన పిచ్చాటూరు పోలీసులు

ప్రజాశక్తి- పిచ్చాటూరు : మండలంలోని రాజానగరం గ్రామంలో సుబ్రహ్మణ్యం(42) అనే వ్యక్తి మంగళవారం గ్రామంలోని తాగునీటి ట్యాంక్‌పై ఎక్కి ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న పిచ్చాటూరు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి హుటాహుటిన తన సిబ్బందితో కలిసి రాజానగరం చేరుకున్నారు. అప్పటికే ట్యాంక్‌పై ఉన్న సుబ్రహ్మణ్యంతో చాకచక్యంగా మాట్లాడారు. మెల్లగా ఎస్ఐ ట్యాంక్ పైకి ఎక్కి సుబ్రహ్మణ్యంకు జీవితం పై భరోసా కల్పించి క్షేమంగా కిందకి దించారు. దీంతో సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సుబ్రహ్మణ్యం తల్లి కృష్ణవేణి గత వారం పుత్తూరులో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకొని మరణించారన్నారు. ఆ బాధను తట్టుకోలేకనే సుబ్రహ్మణ్యం ఆత్మహత్యకు యత్నించాడని వివరించారు. చాకచక్యంగా వ్యవహరించి నిండు ప్రాణాలను కాపాడిన ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, పోలీసు సిబ్బందికి సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-గూడూరు, గూడూరు రూరల్: పేద ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పట్టించడంపై పోలీసులు నిఘా ఉంచారు. ఈ నిఘాలో భాగంగా గూడూర్ రూరల్ మండల పరిధిలోని కామాక్షి నగర్ ప్రాంతంలో పోలీసులు లారీలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో నెల్లూరు నుండి లారీలో బెంగళూరుకు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే నిందితుడితోపాటు డ్రైవర్, లారీని స్వాధీనం చేసుకుని మీడియా ముందు ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని గూడూరు గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం డీఎస్పీ సూర్యనారాయణ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గూడూరు మండలంలోని కామాక్షినగర్ ప్రాంతంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర లారీకాటా వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఓ లారీలో పది టన్నుల బియ్యంను తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. వెంటనే లారీతోపాటు మల్లివేముల వెంకటేశ్వర్లు, లారీ డ్రైవరు నాగేళ్ళ వెంకట విజయకుమార్‌ను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు నిందితులపై క్రిమినల్ కేసు నమోదు చేశామని డీఎస్పీ వివరించారు. ఈ సమావేశంలో సీఐ దశరథ రామారావు, ఎస్ఐ బ్రహ్మనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ నమోదు సేవలను సద్వినియోగం చేసుకోండి

ఇన్‌చార్జ్ ఎంపీడీవో విజయకుమారి

ప్రజాశక్తి -సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడు మండల పరిషత్ కార్యాలయంలో నవంబర్ 23 నుంచి ప్రారంభం కానున్న ఆధార్ నమోదు సేవలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంపీడీవో విజయకుమారి అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ సత్యవేడు మండలంలోని ప్రజల సౌకర్యార్థం ఆధార్ నమోదు సేవలపై ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆధార్ నమోదుపై ప్రత్యేక డ్రైవ్ జరుగుతుందన్నారు. ఇందులో భాగంగానే బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడు రోజులు పాటు ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలకు కొనసాగుతుందన్నారు.

వరి పంటలో సస్యరక్షణ చర్యలు

ప్రజాశక్తి-కోట: ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వరి పొలంలో ఆకు ముడత తెగులు ఆశించే అవకాశం ఉన్నందున రైతులందరూ నత్రజని, ఎరువుల మోతాదును తగ్గించి వాడాలని వ్యవసాయ శాఖాధికారి నిరంజన్ కుమార్ అన్నారు. అదేవిధంగా రైతు సోదరులు నారు నాటేటప్పుడు నారు కొనలు తుంచి నాటుట ద్వారా ఆకు ముడత పురుగు గుడ్లు నాశనం అవుతాయనీ, దీని ద్వారా తెగులు సోకే అవకాశం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నిరంజన్ కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు సాయి కుమార్, వ్యవసాయ సహాయకులు కొక్కుపాడు, వంజివాక,వెంకన్న పాలెం, కోట రైతులు పాల్గొన్నారు

వసతి గృహాలను శాశ్వత భవనాలకు మార్చాలి

ఎబివిపి బాగ్ కన్వీనర్ తడుకు చందు

ప్రజాశక్తి-నాయుడుపేట: అఖిల భారత విద్యార్థి పరిషత్ నాయుడుపేట శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ వసతి గృహాలను శాశ్వత భవనాల్లోకి మార్చాలని నాయుడుపేట ఎంఈఓకి వినతిపత్రం అందజేశారు. అనంతరం బాగ్ కన్వీనర్ తడుకు చందు మీడియాకు వివరాలు తెలియజేస్తూ ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని వసతి గృహాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని శాశ్వత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. హరినారయణ, గౌతమ్, తనుష్, విద్యార్థులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కట్టా సుధాకర్ రెడ్డి

ప్రజాశక్తి -నాయుడుపేట: తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డిని మంగళ వారం ఉదయం వైసిపి రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌కు శాలువా కప్పి పుష్ప గుచ్చం అందజేసి అభినందనలు తెలియజేశారు. అనంతరం ఆయన నాయుడుపేట రెవిన్యూ డివిజన్‌లోని కొన్ని సమస్యలను ఆయన ముందుంచారు. ముఖ్యంగా భూసమస్యలను పరిష్కరించాలని కోరారు. నాయుడుపేట మాజీ వైస్ ఎంపిపి నల్లు కస్తూరయ్య, ఓజిలి మాజీ జెడ్పిటిసి సభ్యులు ముమ్మడి సుబ్బారావు ఉన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

ప్రజాశక్తి -తిరుమల : తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. మంగళవారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో తెలంగాణ డిజిపి మహేందర్ రెడ్డి, ఉమ్మడి రాష్ట్ర మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్,తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యే జ్యోతుల చంటి బాబులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. టిటిడి అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగ నాయకుల మండపంలో శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు..

'అమరరాజా'కు 8 అత్యున్నత అవార్డులు

ప్రజాశక్తి-రేణిగుంట: ఇండోనేషియాలోని జకార్తాలో గత వారం 15వ తేదీ నుంచి 18 నవంబర్ 2022 వరకు జరిగిన 47వ అంతర్జాతీయ స్థాయి క్వాలిటి కంట్రోల్ సర్కిల్ పోటీలలో అమర రాజ సంస్థకు 8 అత్యున్నత పురస్కారాలు (గోల్డ్ అవార్డులు) సాధించారని సంస్థ యాజమాన్యం మీడియాకు మంగళవారం వెల్లడించారు. లెడ్ యాసిడ్ బ్యాటరీ తయారీ, పవర్ కన్వర్షన్ ఉత్పత్తులు, ఇంజనీరింగ్, ప్లాస్టిక్స్, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఇండస్ట్రియల్ సర్వీసెస్ ఆహార ఉత్పత్తులు లాంటి వివిధ రంగాలలో వ్యాపారాలను విస్తరించిన ఇండియన్ బహుళ జాతి సంస్థ అయిన అమర రాజ నుండి 8 టీమ్ లు ఈ అంతర్జాతీయ పోటీలలో పాల్గొన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 14 దేశాల నుంచి 800 బృందాలకు చెందిన 5వేల మందితో పోటీపడి ప్రతి విభాగంలోనూ అమరరాజా బృందం గోల్డ్ అవార్డు గెలుచుకుందన్నారు.

'దళిత సమరభేరిని విజయవంతం చేయండి'

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: తిరుపతి వేదికగా ఈనెల 24వ తేదీన తలపెట్టబోయే టిడిపి దళిత సమరభేరి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గాదిపాకుల గోపీనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక ఎన్టీఆర్ భవన్లో మంగళవారం టిడిపి దళిత విభాగం నాయకులు సమావేశమయ్యారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టాక దళితులపై కక్షపూరితంగా దాడులు చేస్తుందంటూ గోపీనాథ్ మండిపడ్డారు. దళితులు ఐక్యంగా జగన్ ప్రభుత్వాన్ని కూలదోయాలని పిలుపునిచ్చారు. తిరుపతి పార్లమెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు సుబ్బయ్య, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, చుక్కల రమేష్, ప్రధాన భాస్కర్, కూలి సన్నీ, కోబాకు లక్ష్మణ్, పసల రామకృష్ణ, వెంకయ్య బాబు, మణి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు: సర్పంచ్

ప్రజాశక్తి- పుత్తూరు టౌన్: రూరల్ మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీ సదాశివ కాలనీలో పారిశుధ్యంపై సర్పంచి విరిత దేవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో దోమల మందు, డ్రైనేజీ కాలువలు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పారిశుధ్య లోపం లేకుండా గ్రామంలో దోమలు చేరకుండా డ్రైనేజీ కాలువను శుభ్రం చేసి, మందులు వేసి దోమల చేరకుండా ఉండేందుకు తగు ఏర్పాట్లు చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచి పద్మ సదాశివ ఎస్టి కాలనీ కృష్ణయ్య, ప్రజలు, పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి -తొట్టంబేడు: మండలంలోని తొట్టంబేడు పంచాయతీ రామచంద్రపురం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులకు కాపీ రైటింగ్ పుస్తకాలు మంగళవారం వైసీపీ నాయకులు కలవగుంట భరత్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు చేతిరాతలో కూడా నైపుణ్యత ఉండాలన్నారు. మంచి రైటింగ్ ఉంటేనే మంచి మార్కులు కూడా సాధిస్తారన్నారు. అనంతరం పాఠశాలలోని ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు 75 మంది విద్యార్థిని, విద్యార్థులకు పుస్తకాలుతో పాటు పెన్సిళ్లు, పెన్నులు, చాక్లెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఆయన్ను పాఠశాల ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సబీర్ భాష, విజయ్, రమేష్ వెంకటేష్, గోవిందు, శివ, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

ప్రజాశక్తి-పాకాల: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు ప్రభు అన్నారు. స్థానిక ఎన్విఎన్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రావలసిన బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగాల సమస్య లు పరిష్కరించడానికి ప్రభుత్వం కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మండల నాయకులు పాల్గొన్నారు.

25న సెబ్ పోలీస్ స్టేషన్లో వాహనాల వేలం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి అర్బన్ స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) పోలీస్ స్టేషన్లో వివిధ నేరాల్లో పట్టుబడిన వాహనాలను 25వ తేదీ ఉదయం 10 గంటలకు వేలం వేయనున్నట్లు పోలీస్ స్టేషన్ సిఐ ఓ ప్రకటనలో తెలిపారు. వాహనాల వేలంలో పాల్గొనదలచిన వారు నిర్దేశించిన రుసుము చెల్లించి వేలంలో పాల్గొనాలని, ఆధార్ కార్డు వెంట తెచ్చుకోవాలని తెలిపారు. నిబంధనలు వర్తిస్తాయని, మరిన్ని వివరాలకు సెబ్ అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

కార్తీక వనభోజనాలకు విశేష స్పందన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్తీక వనభోజనాలకు విశేష స్పందన లభించింది. స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వన భోజనాలను ప్రారంభించారు. కుల, మతాలకు అతీతంగా ప్రజలు సహపంక్తి భోజనాలు చేయడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు. ఆలయ పాలక మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

పెంచిన ఇంధనం ధరలు తగ్గించాలి

ఆటో కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు తంజావూరు మురళి డిమాండ్

ప్రజాశక్తి- గూడూరు: కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వాలు డీజల్, పెట్రోల్, ధరలు తగ్గించాల్సింది పోయి, వ్యాట్ పేరుతో ఆటో కార్మికులను, ప్రజలను దోచుకుంటున్నాయని ఆటో కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, తంజావూరు మురళి డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి జిల్లా ఆటో డ్రైవర్స్ అండ్ కార్మిక సంఘం గూడూరు కమిటీ సమావేశం, సి.ఐ.టి.యు. కార్యాలయంలో భాస్కర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఆటో డ్రైవర్లు బాగా చదువుకొని ఉద్యోగాలు లేక, బతుకుదెరువు దొరక్క, కుటుంబాన్ని పోషించలేక నానా ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వాలు వారికి సదుపాయాలు చూపించాల్సింది పోయి నిత్యం పోలీసులు ఈ -చలానాల పేరుతో దాడులు నిర్వహిస్తూ ఆటో కార్మికుల జీవనానికి అడ్డు తలుగుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యు నాయకులు పి.మణి, రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, కె.వి.పి.ఎస్.జిల్లా కమిటీ సభ్యులు అడపాల ప్రసాద్, జిల్లా మున్సిపల్ కార్మిక సంఘం కార్యదర్శి బి.గోపి, గూడూరు సి.ఐ.టి.యు ఆటో కార్మిక సంఘం కార్యదర్శి బి.వి.రమణయ్య, నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.

నాక్ పనులను సకాలంలో పూర్తి చేయండి

ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున

ప్రజాశక్తి - క్యాంపస్ : నాక్ పనులను సకాలంలో పూర్తి చేయాలని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున అధికారులకు ఆదేశించారు. శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఉపకులపతి ఆచార్య దువ్వూరు జమున వర్సిటీలోని పలు విభాగాలను ఆకస్మికంగా మంగళవారం సందర్శించారు. పలు విభాగాలలోని రికార్డులను, నాక్ కమిటీకి సంబంధించిన వివిధ పనులను గురించి ఆరా తీశారు. ఆయా విభాగాలలోని అభివృద్ధి పనుల గురించి, విభాగానికి అవసరమైన సామగ్రి, సౌకర్యాల గురించి విభాగాధిపతులతో చర్చించారు. ఈ సందర్భంగా ఉపకులపతి కళాశాల ప్రిన్సిపాల్స్‌తో సమావేశమై కళాశాల పరిధిలో నాక్ కమిటీకి సమర్పించవలసిన వివిధ రికార్డులను, ఇతర అంశాలను, పరిశోధన, అభివృద్ధి అంశాలను గురించి క్షుణ్ణంగా చర్చించారు. వర్సిటీ కులసజీవులు ఆచార్య డిఎం. మమత మాట్లా డుతూ విభాగాలలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం దిశగా కృషి చేస్తానని అన్నారు. వర్సిటీలోని అన్ని విభాగాలలో అన్ని భవనాలలో త్రాగునీరు, కరెంటు సదుపాయాలు, టాయిలెట్ సదుపాయాలను కూడా కచ్చితంగా పర్యవేక్షించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఇంజనీర్, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏకాభిప్రాయంతోనే నామినేటెడ్ పదవుల భర్తీ

నేతలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం వెల్లడి

ప్రజాశక్తి-నాగలాపురం : నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో కీలకంగా ఏకాభిప్రాయం దిశగా , సమిష్టిగా నాయకులు అడుగులు వేయాలని ఎమ్మెల్యే ఆదిమూలం వెల్లడించారు. మంగళవారం మార్కెట్ యార్డు వద్ద జరిగిన వైకాపా నేతల సమావేశంలో ఎమ్మెల్యే పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. నాగలాపురం, బుచ్చినాయుడుకండ్రిగ మార్కెట్ కమిటీ ల నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైందని, వాటి భర్తీ ప్రక్రియ త్వరలోనే చేపట్టనున్నట్లు తెలిపారు. ఇదేవిధంగా సురుటపల్లి ఆలయ ఛైర్మన్, సభ్యుల నియామకాలు పూర్తి చేయాలన్నారు. వీటికి సంబంధించిన ఆశావహుల జాబితా కూడా పెద్దదిగా ఉండటం చర్చనీయాంశంగా మారిందన్నారు. సమావేశంలో ఆలయ ఛైర్మన్ కుర్చీకి మండలానికి ముగ్గురు చొప్పున ఎమ్మెల్యే వద్ద పేర్లు వినిపించారు. నేతలు, కార్యకర్తలు సమన్వయంతో ఏకాభిప్రాయం దిశగా ముందుకు రావాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఒకే తాటి పై.. జాబితాను సిద్ధం చేసుకుని జిల్లా మంత్రి నారాయణ స్వామి, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వద్దకు వెళ్లి ఆమోదం వేసుకోవాల్సిందేనని ఆయన వెల్లడించారు .మీరు ఒకసారి.. నేను ఒకసారి కాకుండా జాబితాతో వారిని కలవడం మిశ్రమ ఫలితాలను నమోదు చేసుకోవచ్చునన్నారు ఏకాభిప్రాయం అన్నింటికి మంచిదన్న విషయాన్ని గుర్తించి అడుగులు వేయాలని ఆదిమూలం నేతలకు ఉద్బోధ చేశారు.

వైభవోపేతంగా నదీ హారతులు

పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: సద్యోముక్తి క్షేత్రం శ్రీకాళహస్తిలో శ్రీకాళహ స్తీశ్వరాలయం తరపున మంగళవారం నిర్వ హించిన స్వర్ణ ముఖి నదిహారతుల కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా సాగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఆగ మోక్తంగా స్వర్ణముఖికి హారతులు సమర్పించారు. ఎన్నో ఏళ్ల కిందట ఆగిపోయిన నదీ హారతుల కార్యక్రమాన్ని తన ఆధ్వర్యంలో నిర్వహించడం ఆనందంగా ఉందని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. నదిహారతుల కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు భాగస్వాములు కావడం మరింత ఆనందాన్నిస్తోందని చెప్పారు. ఆలయ పాలక మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో సాగర్ బాబు పాల్గొన్నారు.

స్వర్ణముఖిలో గంగమ్మతల్లికి హారతులిచ్చిన ఎమ్మెల్యే

నాయుడుపేట: పవిత్ర కార్తీక మాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని నాయుడు పేట పట్టణంలోని స్వర్ణముఖి నది ఒడ్డున పుస్కర ఘాట్ వద్ద సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యులు కిలివేటి సంజీవయ్య భక్తి శ్రద్ధలతో గంగమ్మ తల్లికి హారతులిచ్చారు. అనంతరం స్వర్ణముఖి నది సమీపాన ఉన్న శివాలయంలోని ప్రసూనాంబ సమేత నీల కంఠేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఆర్డీవో విచారణ

ప్రజాశక్తి -బాలాయపల్లి: మండలంలోని రామా పురం గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైన సంఘటన పై గూడూరు డివిజన్ రెవెన్యూ అధికారి కిరణ్ కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులతోపాటు కఠినమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. గూడూరు సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్, తహాశీల్దార్ అజ్మితుల్లఖాన్, ఎంపిడిఓ వినిల్ కుమార్, ఎస్‌హెచ్ఓ, క్షేత్రస్థాయి సిబ్బంది ఉన్నారు.

ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి -పిచ్చాటూరు: మండలంలోని రెప్పలపట్టు వద్ద ద్విచక్ర వాహనంపై కేవీబీ పురం నుండి పిచ్చాటూరు వైపు వస్తున్న వ్యక్తికి అడ్డంగా కుక్క రావడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు 108కు సమాచారం అందించి క్షతగాత్రుని చికిత్స నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

శ్రీపద్మావతి అమ్మవారికి చెన్నై గొడుగులు

ప్రజాశక్తి-తిరుచానూరు: శ్రీ పద్మావతి అమ్మవారికి మంగళవారం 5 గొడుగులు కానుకగా అందాయి. చెన్నైకి చెందిన హిందూ ధర్మార్థ సమితి అర్గనైజింగ్ కార్యదర్శి ఆర్ఆర్.గోపాల్‌జి ఆధ్వర్యంలో ఈ గొడుగులను తీసుకొచ్చారు. ఆలయం ఎదుట జరిగిన కార్యక్రమంలో ఈ గొడుగులను ఆలయ ఏఈవో ప్రభాకర్ రెడ్డికి అందించారు. ఆర్జితం ఇన్‌స్పెక్టర్ దాము, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పందులను పట్టణం దాటించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రజారోగ్యం దృష్ట్యా పందులను పట్టణం దాటించాలని మున్సిపల్ కమిషనర్ బాలాజీ నాయక్ పందుల పెంపకందార్లను మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈనెల 23వ తేదీ లోపల పందులను పట్టణానికి పది కిలోమీటర్ల పరిధిలో ఉంచాలనీ, 24వ తేదీ నుంచి పందులు పట్టణంలో కనిపిస్తే జరిమానా తప్పదని హెచ్చరించారు.

భోజనం, స్వీట్లు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు రూరల్: పట్టణంలోని శ్రీకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు విజయవాడ రైల్వే డివిజన్ డీఆర్‌యుసీసీ మెంబర్, మయూరి స్వీట్స్ అండ్ బేకరి, వనజా కృష్ణ కళ్యాణ మండపం అధినేత రొటేరియన్ డాక్టర్ బి.శ్యామ సుందరరావు దాతృత్వంతో మంగళవారం గుడూరు పట్టణం గమల్లపాలెంలో ఉన్న మెప్మా, మున్సిపాలిటీ సౌజన్యంతో నిర్వహి స్తున్న మైఫ్రెండ్స్ అసోసియేషన్ వసతి గృహంలోని నిరాశ్రయులకు మధ్యాహ్నం భోజనం, స్వీట్లను అందించారు. మయూరి శ్యామ్ యాదవ్, ఇబ్రహీం, కేర్ టేకర్ రమేష్ పాల్గొన్నారు.

అన్నదానానికి లక్ష విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వ రాలయ నిత్యాన్న పథకానికి వైజాగ్‌కు చెందిన గంప హరి మంగళవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని అన్నదాన పథకానికే ఖర్చు చేయాలని ఆలయ పాలక మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులును కోరారు.

మీ గ్రామంలోనే మీకు సేవలు :తహశీల్దార్

ప్రజాశక్తి - బాలాయపల్లి: ప్రభుత్వ అన్ని శాఖల అధికారులు మీ గ్రామంలోని ఉంటూ మీకు సేవలు చేయడం జరుగుతుందని తహశీల్దార్ అజ్మతుల్లా ఖాన్ అన్నారు. మంగళవారం మండలంలోని పిగిలాం గ్రామంలో వెల్నెస్ సెంటర్ భూ పరిశ్రమపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మీ గ్రామంలోని అన్ని శాఖల అధికారులు ఉంటూ మీకు సేవలు చేసేందుకు ప్రత్యేకంగా సచివాలయం వ్యవస్థను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఈ వ్యవస్థతో గ్రామాలు అభివృద్ధి తథ్యమని చెప్పారు. ఎస్ఐ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రజలందరూ స్నేహబాంగా ఉండాలని కోరారు. సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేపు ద్విచక్రవాహనాలు వేలం

ప్రజాశక్తి-కార్వేటినగరం: ఈ నెల 24న ద్విచక్రవాహనాలు వేయడం జరుగుతుందని ఎస్ఐ దస్తగిరి తెలిపారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్.ఐ మాట్లాడుతూ అక్రమంగా సారా తరలిస్తూ పోలీసులు దాడుల్లో పట్టుబడిన 9 ద్విచక్రవాహనాలను ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు పోలీస్ స్టేషన్ ఆవరణంలో వేలం వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆశక్తి కలిగిన వారు. ముందస్తు ధరావత్తు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని తెలిపారు.

IN THE COURT OF Ist Adl JUNIOR CIVIL JUDGE OF TIRUPATI.
O.S.NO. 228/2019

Canara Bank, I.S.Mahal Branch, Rep by its Manager. ...Plaintiff

Vs

N.Lokanadhan. ...Defendant

SUIT NOTICE TO DEFENDANT

To,
Sri N.Lokanadhan, S/o. N.Ramachandhraiah, Kandulavaripalli(Vi), Chandragiri Mandal, D.No.20-4-34-10M, Subba Reddy Nagar, Akkarampalli, TIRUPATI.
Sir,
Please take Suit notice in the above suit the suit is filed by the plaintiff bank against you for the recovery of suit amount of Rs.1,45,361/- as on 2.2.2019 along with subsiqnent interest and costs of the suit the case stands posted to 24.11.2022 for your appearance before the aforementioned court either in person or through your counsel. In case if you fail to attend before the aforementioned court by 10.30 A.M.. The Matter will be decided on your exparty.

//By Order of the Court//
S.NIRANJAN BABUJI, B.Com.,L.L.B.,
M.USHASRI, B.Com.,B.L.,
Advocates For Plaintiff
TIRUPATI.

IN THE COURT OF THE Vth ADDL DISTRICT JUDGE : TIRUPATI.
E.P.NO. 71/2019
O.S.NO. 189/2012

P.Suneetha & Another. ...Decree Holder

Vs

P.Sreenivasa Sharma. ...Judgment Debtor

NOTICE TO THE RESPONDENT/J.Dr.

To,
P.Srinivasa Sharma, S/o PSR Mohan Rao, D.No.7-121/14, Kotramangalem Road, Tirchanoor, Tirupati Rural, Chittor (Dist).
Sir,
Please take Notice, that the above Execution Stands posted to petition to 30.11.2022 for your appearance. Do appear and file your objection at 10.30 A.M. in the above mentioned court Else the matter will be decided exparte.

K.AJAY KUMAR,
Advocate for D.Hr.
TIRUPATI.
Cell: 9849072772.

Municipal Administration Department
Venkatagiri Municipality
e-procurement Notice

Roc. No. 1053/2022/E1 Dated: 22-11-2022
Grant: SWM (2022-23) Estimate Contract Value Rs. 5.76 Lakhs
Name of Work:
Internal Roads, Electricity and Basic Amenities for the Improvement of Solid Waste Management site in Dumpyard of Venkatagiri Municipality.

N.I.T. No. 05/VMC/MPLTY/SWM/2022-23
Bid Document download Start Time & Date : 2.30 PM on 22-11-2022
Bid Document download End Time & Date : 3.30 PM on 28-11-2022
Bid Submission Closing Time & Date : 4.30 PM on 28-11-2022

Further details can be seen @ 'e' procurement market place @ "www.eprocurement.gov.in" Mobile No. 9603361698.

COMMISSIONER
Venkatagiri Municipality.